క్లుప్తంగా

ఐతోల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు



తాడూరు: మండలంలోని ఐతోల్‌లో క్రియా యోగ ధ్యాన తపోవన సేవాశ్రమ చారిటబుల్ ట్రస్ట్ జేజే ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన జేజే ఆస్పత్రి అధినేత డాక్టర్ జయంత్‌రెడ్డి, డా జయరాంరెడ్డిలు హాజరై ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. 100 మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యురాలు జయంతిరెడ్డి, మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వామి జ్ఞానానంద, గ్రామస్తులు నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, అనంతరాములుగౌడ్, రాంకిషన్, హరికృష్ణ పాల్గొన్నారు.

వాటర్ క్యాన్లు వితరణ

లింగాల: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులకు నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ఐదు వాటర్ క్యాన్లను వితరణ చేశారు. ఆదివారం యువజన కాంగ్రెస్ నాయకులు వసతి గృహం సందర్శించారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఒక వాటర్ క్యాన్ మాత్రమే ఉందని వారి దృష్టికి తీసుకెళ్లడంతో ఐదు క్యాన్లను సమకూర్చి అందజేశారు.

వార్డులలో వైద్యుల బృందం పర్యటన



లింగాల: మండల కేంద్రంలోని పలు వార్డులలో సీహెచ్‌సీ, అంబట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యులు శివశంకర్, ప్రశాంత్, అనిల్‌కుమార్ ఆయా వార్డులలోని ఇంటింటికి తిరుగుతూ ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీటి కుండీలు, పాత టైర్లు, కూలర్లు, సంపులో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని వివరించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనకు తక్షణమే షెడ్యూల్ ప్రకటించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు తక్షణమే షెడ్యూల్‌ను ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కుల గణన నిర్వహించి 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కాశ్ల నిరంజన్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నిరంజన్ యాదవ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్‌జంగయ్యకు నివాళి

అచ్చంపేట రూరల్: పట్టణంలో మాజీ ఎంఈఓ బాల్‌జంగయ్య సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి హాజరై నివాళి అర్పించారు. బాల్‌జంగయ్య సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, రవికిరణ్, లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుకు నేడు చివరి తేదీ

చారకొండ: రైతుబీమా దరఖాస్తుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉందని ఏఈ చిన్న హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత పత్రాలను అందజేసి బీమా నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తెలకపల్లి: మండలంలోని రాకొండ గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఉప్పునుంతల మండలం జినుకుంట గ్రామానికి చెందిన జహంగీర్ పాషా ద్విచక్రవాహనంపై తెలకపల్లి నుంచి జినుకుంటకు వెళ్తుండగా మార్గమధ్యలో శ్మశానవాటిక దగ్గర ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న జహంగీర్‌పాషాకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

కేఎల్ఐ నీరే ఆధారం

- ఆశించిన స్థాయిలో పడని వర్షం
- ఏడేళ్లుగా క్రమంగా తగ్గుతున్న వర్షపాతం



మర్రిపల్లి సమీపంలో ఎంజీకేఎల్ఐ కాలువ వెంట నిండుగా పారుతున్న సాగునీరు

ఉప్పునుంతల: మండలంలో ఎంజీకేఎల్ఐ కాలువల వెంట కృష్ణమ్మ పరుగులు తీస్తుంది. రెండు రోజుల కిందట మండలంలోకి ప్రవేశించిన సాగునీరు ప్రస్తుతం ఉప్పునుంతల మండల కేంద్రంతోపాటు మర్రిపల్లి, ఉప్పరిపల్లి, జప్తీ సదగోడు, తదితర గ్రామాల వరకు నీరు పారుతోంది. మరో మూడు నాలుగు రోజుల్లో వెల్టూరు చివర వరకు కాలువ నీరు చేరనుంది. ఏడాదికేడాది క్రమంగా వర్షపాతం పూర్తిగా తగ్గిపోతున్న క్రమంలో ఏడేళ్లుగా రైతులకు కేఎల్ఐ సాగునీరే దిక్కవుతోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కొన్నేళ్లుగా చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రావడంలేదు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువల ద్వార వచ్చిన నీటితోనే రైతులు చెరువులు, కుంటలు నింపుకున్నారు. దాంతోనే గ్రామాల్లో తాగునీటి సమస్యగాని, పంటలకు సాగునీటి కొరత కొంతవరకు తగ్గిపోయింది. కరువు పరిస్థితుల్లో రైతులకు కేఎల్ఐ నీరే జీవనాధారం అయ్యింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వర్షాలు కురువక గ్రామాల్లో చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. ఈ సమయంలో అలుగులు పారాల్సిన చెరువులు, కుంటలు ఒట్టిబోయి కన్పిస్తుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. మరోవైపు ఎగువ రాష్ట్రాల్లో భారీగా పడుతున్న వర్షాలకు కృష్ణానది పొంగిపార్లి శ్రీశైలం ప్రాజెక్టులోకి వరదనీరు వస్తుండటం, కేఎల్ఐ ఎత్తిపోతల మోటార్లను ప్రారంభించడంతో గతేడాదికంటే ముందే ఈ సంవత్సరం కాలువల ద్వార నీరు వస్తుండటంతో రైతులు సంతోషపడుతున్నారు. గతేడాది యాసంగి పంట చివరి వరకు కేఎల్ఐ కాలువ ద్వార నీరు పారడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో యాసంగి పంటగా వేరుశెనగను సాగుచేయడానికి పొలాలను ఖాళీగా ఉంచుకున్నారు. కొంతమంది రైతులు వేరుశెనగ పంట సాగుకు పొలాలను దున్ని పెట్టుకుంటున్నారు. ఇటీవల అడపాదడపా పడుతున్న ముసురు వర్షాలకు మెట్ట పంటలు ఆశాజనకంగా కన్పిస్తున్నాయే తప్పా భూగర్భజలాలు వృద్ధిచెందే వర్షం ఎక్కడ పడలేదు. కనీసం పొలాల్లో ఉన్న చిన్నపాటి వంపులు, వాడికెలు పార్లని పరిస్థితి ఉంది. వ్యవసాయ పొలాల్లోని బోరుబావుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. కొన్ని బోర్లలో నీరులేక ఆరిపోయాయి. మండలంలో 81 చెరువులు, కుంటలు ఉండగా వాటి కింద 4352 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలం ప్రారంభమై దాదాపుగా రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివకు చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. కాలువల ద్వార సాగునీరు వస్తుందనే ఆశతో చెరువులు, కుంటలు నిండగలవనే నమ్మకంతోనే రైతులు వరినాట్లు వేసుకుంటున్నారు. కాలువల వెంట నీరు పారుతుండటంతో మరో వారం పది రోజుల్లో బోర్లలో నీరు పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరున్న రైతులు మాత్రం వరినాట్లు వేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు కాలువల వెంట నీరు రావడంతో అదనంగా వరినాట్లు వేసుకోవడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.



వర్షాభావ పరిస్థితిలో నీరు లేక వెలవెలబోతున్న కాంసానిపల్లి మర్యాద సముద్రం చెరువు

కేఎల్ఐ సాగునీటిపైనే రైతుల ఆశలు

ఏడేళ్ల నుంచి మండలంలో పారుతున్న ఎంజీకేఎల్ఐ నీటితోనే రైతులకు సాగునీటి సమస్యలేకుండ ఉంది. కేఎల్ఐ నీటితో మండలంలో 80 శాతం లబ్ధిచేకూరుతుంది. కేఎల్ఐ కాలువల ద్వార నీరు పారి చెరువులు, కుంటలు నింపడంతో పంటలు పండించుకున్న రైతులు ఈ ఏడాది కూడా కాలువ ద్వార నీరు రావడంతో సంతోషంతో వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారు. కాలువల వెంట వచ్చిన ఎంజీకేఎల్ఐ నీటితో మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటల్లోకి నీరు పూర్తిస్థాయిలో నీరు రావడంతో ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తీరడంతోపాటు బోర్లు ఊటబట్టి ఇప్పటివరకు నీటిని అందిస్తున్నాయి. కేఎల్ఐ కాలువల వెంట సాగునీరు వస్తుందనే నమ్మకంతో దాదాపుగా 1000 ఎకరాల మేరకు వరినాట్లు వేసుకోవడానికి రైతులు నారుమడులు వేసుకునట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మండల సరిహద్దులోని దుందుభీ నది గుండా డిండి ప్రాజెక్టులోకి ఎంజీకేఎల్ఐ నీటిని వదిలితే నది పరిసర ప్రాంతంలో వరినాట్లు వేసుకోవాలనే తలంపుతో రైతులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరు..

ఇప్పటివరకు కేఎల్ఐ ద్వార సాగునీరు అందుతున్న గ్రామాలు మినహాయిస్తే మండలంలోని శ్రీశైలం– హైదరాబాద్ రోడ్డుకు తూర్పుదిశగా ఉన్న తొమ్మిది గ్రామ పంచాయతీలకు సాగునీరు అందించడానికి కేఎల్ఐ కాలువ విస్తరణ కోసం భూసేకరణ పూర్తిచేయడంతోపాటు కాలువ తవ్వకం పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల్లో కొంతమేర కాలువలను తవ్వారు. కాలువల పనులు పూర్తికాబడితే లత్తీపూర్, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల, సీబీ తండా, పూర్యానాయక్ తండా, ఈరట్వానిపల్లి, అయ్యవారిపల్లి, ఫిరట్వానిపల్లి, రాయిచెడ్ గ్రామ పంచాయతీలకు సాగునీటి లబ్ధి చేకూరనుంది.

కేఎల్ఐ నీటితోనే పంటలు పండిస్తున్నాం



కేఎల్ఐ కాలువల ద్వారా పారుతున్న సాగు నీటి ద్వారా పంటలు పండిస్తున్నాం. కాలువల అంచున మోటార్లు అమర్చి పంటలకు నీటి తడులు ఇస్తున్నాం. ఈ ఏడాది ముందస్తుగా కాలువల వెంట నీరు వదలడం సంతోషంగా ఉంది. యాసంగిలో 8 ఎకరాల్లో వేరుశెనగ పంటను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నా.

– తోళ్ల లింగమయ్య, రైతు, ఉప్పునుంతల

ఎస్సీ వర్గీకరణ రాజకీయ పార్టీల కుట్ర



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమంజసం కాదని, అది రాజకీయ పార్టీల కుట్రలో భాగమేనని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. 341 ఆర్టికల్ సవరణ, పార్లమెంట్ మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. గతంలో కారంచేడు, చుండూరు, పదిరి, కుప్పం, నీరుకొండ, లక్ష్మీపల్లి గ్రామాలలో దళితులపై దాడులు చేసి వేట కొడవళ్లతో నరికి చంపిన పట్టించుకోని రాజకీయనాయకులు వర్గీకరణ విషయంలో జోక్యం చేసుకొని దళితుల ఐక్యతను విడదీయడం దుర్మార్గమన్నారు. 2011 జనభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమన్నారు. ఎస్సీ కులాల జనగణన చేసి ఎవరి వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకి కుర్మయ్య, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి మల్లేష్, నియోజకవర్గ నాయకులు కుర్మయ్య, శేఖర్, రామస్వామి, చంద్రశేఖర్, చందు, చిన్నయ్య, కూన సంజీవయ్య, చెన్నయ్య, తెలకపల్లి మండల అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, కార్యవర్గ ప్రతినిధి వెంకటస్వామి, నాయకులు వెంటయ్యయ, చంద్రశేఖర్, రవి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం

తెలకపల్లి: ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో వీఓఏలు, ఏఎన్ఎంలు హాజరవ్వాలని కోరారు. 6వ తేదీన తాగునీటి వనరుల దగ్గర శుభ్రం చేయడం, నీటి క్లోరినేషన్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, 7వ తేదీన పారిశుద్ధ్య పనులను చేపట్టడం, రోడ్లపై మురుగునీటి గుంతలు పూడ్చనునట్లు తెలిపారు. 8న డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధులపై గ్రామాలలో అవగాహన కల్పించాలని, 9వ తేదీన ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర స్థలాలను శుభ్రం చేసే కార్యక్రమం ఉంటుందని వివరించారు.

తాడూరు: నేటి నుంచి ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఎంపీఓ బ్రహ్మచారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్‌లో ఇటీవల తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన ముగ్గురు ఆడపిల్లలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్ ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని సందర్శించారు. అనంతరం వారికి రూ.10వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ధనుంజయ గౌడ్, కాశిపురం మహేష్, మెంటే శివకృష్ణ, కురుమయ్య, సురేందర్, అశోక్, జగపతిరావు, యాదమ్మ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రజా సమస్యలపై పోరాడుతామని బీజేపీ సీనియర్ నాయకుడు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలో మండల, టౌన్ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శి చందు, పి ప్రమోద్, కౌన్సిలర్లు మోతీకుమార్, సీనియర్ నాయకులు యాదగిరిరావు, విష్ణు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, బూత్‌నాయకులు మోహేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పరశురాములు, కృష్ణ, పర్వతాలు, సత్యనారాయణ, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


వెల్దండ: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు కోరారు. ఆదివారం మండల బీఆర్ఎస్ నాయకులు హైదరాబాదులో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, కొండల్‌యాదవ్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకుల కూల్చివేత



ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్, వెల్టూరులో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను ఆదివారం అధికారులు కూల్చివేయించారు. దాదాపుగా ఇరువై ఏళ్ల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకులు సిమెంట్ పెచ్చులూడి ఇనుప ఊచలు తేలాయి. వాటర్ ట్యాంక్ కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ముందు జాగ్రత్తగా కూల్చివేయించారు. పాత ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంక్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మిక్కీ బృందం



కల్వకుర్తిరూరల్: మాదిగల ఆర్థిక సాధికారత కోసం మిక్కీకి తోడ్పాటు ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను నాగర్‌కర్నూల్ మిక్కీ బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రీతమ్ మాట్లాడుతూ ప్రభుత్వం మాదిగలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. మహేష్, విప్లవ్ గాంధీ, రాము, సంజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: మండల విద్యాశాఖ అధికారిగా శంకర్ నాయక్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. వంగూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఆదివారం యూటీఎఫ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ శంకర్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర బాధ్యులు సర్దార్ నాయక్, యూటీఎఫ్ నాయకుడు నెహ్రూ ప్రసాద్, రామలింగం, రాధాకృష్ణ, ఎల్లయ్య గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, నరేష్, వెంకటయ్య, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

మన్ననూర్: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి రేణయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టివిక్రమార్క, మంత్రి వర్గానికి నిరుద్యోగుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటు కృషి



చారకొండ: మహనీయులు జ్యోతిబాపులే, సావిత్రీబాయి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు మాదిగ సంఘం అధ్యక్షుడు పల్లె వెంకటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రాయన్‌పల్లి అంబేడ్కర్ కాలనీలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి, పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాంబయ్య గౌడ్, ఉప సర్పంచ్ పర్వతాలు సంఘం నాయకులు పల్లె వెంకటయ్య, రామస్వామి, రఘువరన్, పెద్దయ్య, గెల్వయ్య నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్‌లో ఆదివారం శిబ్దాష్ ఘోష్ 48వ వర్ధంతి సందర్భంగా ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆగస్టు 11న హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో వర్ధంతి సభను నిర్వహిస్తునట్లు ఆ పార్టీ నాయకులు కిరణ్ తెలిపారు. కృష్ణ, మధు, సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి తీజ్ ఉత్సవాలు

అచ్చంపేట రూరల్: గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతి అద్దం పట్టేలా అందరి సహకారంతో తీజ్ ఉత్సవాలను నిర్వహించుకుందామని గిరిజన సంఘం నాయకులు లచ్చునాయక్, దగ్గునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గిరిజన భవనం ఆవరణలో తీజ్ ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు గిరిజన సంఘం నాయకులు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈనెల 17నుంచి 25 వరకు తీజ్ ఉత్సవాలను నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. శంకర్‌రాథోడ్ , రాజుగోపాల్, బీచ్యానాయక్, తులసీరాం, మంత్రియానాయక్, హాతీరాం, నాగ, నాగరాజు, రమేష్, భరత్ రాథోడ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్‌లో ఇటీవల తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన ముగ్గురు ఆడపిల్లలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్ ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని సందర్శించారు. అనంతరం వారికి రూ.10వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ధనుంజయ గౌడ్, కాశిపురం మహేష్, మెంటే శివకృష్ణ, కురుమయ్య, సురేందర్, అశోక్, జగపతిరావు, యాదమ్మ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన నేనావత్ తారసింగ్‌నాయక్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.16,500 చెక్కును ఆదివారం మండల కేంద్రంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. గ్రామీణ ప్రాంత పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, సుమనాయక్, గురువయ్య, శ్రీను, గణేష్ తదితరులు ఉన్నారు.

గొర్రెల కాపరిపై దాడి స్వల్పగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: గొర్రెల కాపరిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన బక్కన్న తన గొర్రెలను జిల్లా కేంద్రంలోని ఓ శ్మశానవాటికలో మేపుతుండగా అక్కడే ఉన్న కొందరు యువకులు కాపరిపై దాడికి పాల్పడ్డారు. స్వల్ప గాయాల కావడంతో చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంగిలి ప్రసాద్ తల్లి మొగులమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పూరి రమేష్, ప్రవీణ్, ఆంద్రయ్య, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



కొల్లాపూర్: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన వరదలకు ప్రాణాలు కోల్పోయిన, క్షతగాత్రుల సహాయార్థం సీపీఎం నాయకులు పట్టణంలో ఆదివారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు పాల్గొని మాట్లాడారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు బాలపీరు, జల్లాపురం సురేందర్, రాముడు, బత్తిని రాజు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



కొల్లాపూర్: హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలని భజరంగదళ్ నాయకులను ఆ సంఘం విభాగ్ సంయోజక్ సురేష్, సంయోజక్ చత్రపతిలు కోరారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలో భజరంగ్‌దళ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. హిందూ మతం గొప్పతనం, సంస్కృతీ, సంప్రదాయాల గూర్చి యువతకు తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో సుంకరి పురేందర్, శివకృష్ణయాదవ్, రాజుయాదవ్, పులి భరత్, మహేష్, డీజే బాలు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి



కొల్లాపూర్: వానాకాలం సంబంధించిన రైతుభరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు రైతుభరోసా అమలు చేయలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు మహేష్, రాజు యాదవ్, శ్రీనివాసులు తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆవరణంలో ఆదివారం లయన్స్‌క్లబ్ కల్వకుర్తి, ఉప్పల చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 51 మంది రక్తదానం చేశారు. ఉప్పల వెంకటేష్, లయన్స్‌క్లబ్ ఆమనగల్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లయన్స్‌క్లబ్ కల్వకుర్తి కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, గణేశ్, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట గ్రామాల్లో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. మంచాలకట్టలో ఆంజనేయస్వామికి ఆకుపూజ చేశారు. అనంతరం మంగళహారతి నిర్వహించి అన్నదానం చేశారు. పెంట్లవెల్లిలోని ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రవీణ్ కుమార్, లోకేశ్వరయ్య ఉన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

మన్ననూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచన మేరకు స్థానిక పీటీజీ పాఠశాల/వసతి గృహాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉంటున్న వసతి గృహం పరిసరాలు, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థుల కోసం వండిన భోజనాలు, కూరగాయలను ఆయన పరిశీలించి రుచి చూశారు. ప్రతి నిత్యం మెను ప్రకారం నాణ్యమైన భోజనం స్నాక్స్ ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్‌ను కలిసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు.

రాములమ్మ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

దోమలపెంట: రాములమ్మ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సీఐటీయూ నాయకులు కిషన్, ఇబ్రహీం, కోటయ్య అన్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దోమలపెంట, వటువర్లపల్లి మధ్యలో యువకులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని ముగ్గురు యువకులు మృతిచెందగా కొన ఊపిరితో ఉన్న మరో యువకుడిని రాములమ్మ ఫౌండేషన్ అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫౌండేషన్ సభ్యులకు ఫోన్ చేయగా సకాలంలో స్పందించి ఘటన స్థలానికి అంబులెన్స్‌ను పంపించడంతో క్షతగాత్రుడికి ఆస్పత్రికి తరలించారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కోళ్ల వెంకటేష్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కోళ్ల శివ, పరమేశ్వర్, టైగర్ జంగయ్య, బాలరాజు పాల్గొన్నారు.